
కథ

# ఈ పాపం మాదే!

కొత్తా అన్నపూర్ణ



''ఇప్పుడంత అవసరం ఏముందిరా కన్నా! పైగా సెలవు రోజులు కాదు. అటు పిల్లలకూ ఇటు కోడలికి సెలవుయిస్తారో లేదో. మేము యిపుడు యింటికొచ్చి ఏం చేయాలిరా? మాకిక్కడ ప్రశాంతంగానే ఉంది. యింకోసారి వస్తాంలే'' అన్నారు అంజనాదేవి గారు కొడుకునుద్దేశించి.

మహీధర్ నొచ్చుకున్నట్టు చూశాడు.

ఆ చూపును అర్థం చేసుకున్న అతని భార్య రవళి అత్తమామల్ని ఉద్దేశించి అంది.

''అదేంటత్తయ్యా అలా అంటారు? యీ వయసులో మిమ్మల్ని ఒక్కరోజు కూడా యింట్లో ఉంచుకోలేకపోతున్నామే అని ఎంత మధనపడిపోతున్నామో తెలుసా! మీ అబ్బాయి నేను రేపు ఎల్లుండి రెండు రోజులు సెలవు పెట్టాం. పిల్లలకు కూడా సెలవు యిమ్మని డైరీలో రాసి పంపించాలి. ఆ తరువాత రోజు ఆదివారం. మూడు రోజులు మనమంతా కలిసి ఉందాం రండి. మీరయినా అత్తయ్యకి నచ్చచెప్పండి మామయ్యా!''

''వాళ్ళంతగా ప్రాధేయపడుతుంటే కాదంటావేంటి? రిటైరయి యిక్కడకు వచ్చిన ఆరు నెలల తరువాత మొదటిసారి వాళ్ల యింటికి రమ్మని కోరుతున్నారు. అయినా మనం వెడుతున్నది పరాయి యింటికి కాదుగా! మన కొడుకు కోడలు యింటికేగా! ఏమంటావ్?'' అన్నారు రమణగారు భార్యకు నచ్చచెబుతున్నట్టుగా.

''నేననేదీ అదే! ఆరు నెలలుగా అలవాటయిపోయింది కదా! అక్కడకు యీ మూడు రోజుల భాగ్యానికి వెళ్లకపోతే ఏం? అప్పుడప్పుడు అబ్బాయి వచ్చి మనని చూసి వెడుతూనే ఉన్నాడు. యింక మనం అక్కడకు వెళ్ళి చేసేదేముంది?'' అన్నారావిడ.

''అలా అనకమ్మా! మాకు కుదిరితే అసలు మిమ్మల్ని యిక్కడ చేర్పించే వాళ్లమే కాదు'' యిప్పుడైనా ఎవరో ఏదో అన్నారనో, అంటారనో అర్జీకీగా కోడలివైపు చూసిన చూపులోని అంతరార్థం గ్రహించిన అంజనాదేవిగారికి ఆ మాటలు కొడుకు మనసులోంచి రావడంలేదని, పెదవుల పైనుంచే వచ్చాయని అర్థమైంది.

అంతలో లోపలకు వచ్చారు పరశురామయ్య గారు.

''హలో అంకుల్ బాగున్నారా!'' అంటూ పలకరించాడు మహీధర్.

తను కూర్చున్న కుర్చీలోంచి లేచి ఆయన పాదాలకు నమస్కరించి ''కూర్చోండి

ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన కథ

అంకుల్!'' అన్నాడు తాను నేలమీద చతికిలపడుతూ.

''ఎంతసేపయిందయ్యా వచ్చి? మా పవన్, భార్య పిల్లలు ఎలా ఉన్నారు?'' అని అడిగారాయన.

''బాగానే ఉన్నారంకుల్. మీరెలాగున్నారో చూసి రమ్మన్నారు. మీకు తమ నమస్కారాలు చెప్పమన్నారు. ఒకే ఆఫీసులో పని చేస్తున్నా, వాడు ఆ సెక్షన్‌కు హెడ్, నేను ఈ సెక్షన్ హెడ్. వర్కుతో ఒకే బిజీ. మొన్న కాకినాడ క్యాంపు వెళ్లాడు. ఈ వారం రాలేనని చెప్పమన్నాడు. మీరైనా అమ్మకి, నాన్నగార్కి చెప్పండంకుల్. రేపు, ఎల్లుండి, నేను, రవళి పిల్లలు సెలవు పెట్టాము. అమ్మ, నాన్నగార్లని యింటికి రమ్మని తీసుకువెళ్ళేటందుకు వస్తే వాళ్ళు రానంటున్నారు. మీరు చెప్పండంకుల్!''

''వెర్రి నాగన్నా! అన్నయ్యగారు మాకు చెప్పలేదా! అక్కడకు వచ్చి నీకు అనవసరమైన యిబ్బంది కలిగించడం ఎందుకని? నేను బట్టలు సర్దుతాను. మీరు మాట్లాడుకుంటూ ఉండండి'' అన్నారు అంజనాదేవిగారు కొడుకు తల ఆప్యాయంగా నిమురుతూ.

''ఆంటీ ఏరి అంకుల్?'' అంటూ ఆయనతో కబుర్లలో పడిపోయాడు మహీధర్. ఆయన కోడలు, మనుమల విశేషాలు అడుగుతూ ఉండిపోయింది రవళి.

మధ్య మధ్యలో రమణరావుగారిని సంప్రదిస్తూనే మూడు రోజులు ఉండేందుకు అవసరమైన లగేజీని సిద్ధం చేసారు అంజనాదేవిగారు.

వాళ్ళు తెమిలాక తల్లిదండ్రులను తీసుకొని బయల్దేరాడు మహీధర్ భార్య రవళితో సహా!

''వదినగార్కి చెప్పండి అన్నయ్యగారు! మూడు రోజుల్లో అంటే ఆదివారం సాయంత్రం వచ్చేస్తాము. యింతకీ ఆవిడ ఏరీ?'' అడిగారు అంజనాదేవిగారు.

''అలసటగా ఉందని పడుకుందమ్మా! నేను చెబుతాన్లే. మీరు వెళ్లిరండి'' మీరు లేని ఈ మూడు రోజులు ఈ ఓల్డ్ ఏజ్ హోమ్ మరీ ముసల్దైపోతుంది. అయినా తప్పదు కదా! వెళ్లిరండి రమణా!'' అన్నారాయన.

కొడుకు కోడల్ని అనుసరించారు అంజనాదేవి, రమణరావు దంపతులు.

★ ★ ★

కొడుకు యింటికి వచ్చాక స్నానపానాదులు పూర్తయ్యాక హాల్లో టీవీ చూస్తూ మనవల కోసం ఎదురుచూడసాగారు రమణరావు దంపతులు.

రాత్రి ఎనిమిదిన్నర సమయంలో వాడిపోయిన బచ్చలితీగల్లా వచ్చారు అంకిత, మదన్.

''నానమ్మా! తాతగారూ!'' అంటూ అమాంతం ఒడిలో వాలిపోయారు. వారిని తనివారా ముద్దాడి వారి చదువు, స్కూలు విశేషాలు అడుగుతున్నంతలోనే ఎదురింటికి ఏదో పనిమీద వెళ్ళిన రవళి రివ్వున వస్తూనే ''మొదలెట్టారా! తాతగారి, నానమ్మల బుర్రతినడం, గబగబా స్నానాలు చేసి రండి. మీరు హోంవర్కు చేస్తుంటే నేను అన్నం పెట్టేస్తాను. ఊ.. క్విక్'' అని హుంకరించడంతో పిల్లలిద్దరూ బిక్కమొగం వేసుకుని కదిలారు.

నెలసరి సరుకుల కోసం వెళ్ళిన మహీధర్ వస్తూనే స్నానం చేసి భోజనం చేసి ''గుడ్ నైట్ నాన్నగారు! సాయంత్రం నుంచీ తిరుగుడేనేమో! బాగా అలసిపోయాను. పడుకుంటాను'' అని తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

అరగంట గడిచాక పిల్లలు ఏం చేస్తున్నారో చూద్దామని లేవబోయిన అంజనాదేవిగారు నిద్రపోయిన కొడుకుని, కూతుర్ని ఒక్కొక్కరిగా వారి బెడ్‌రూమ్‌లోనే పడుకోబెట్టి వచ్చిన రవళిని చూసి యిక మాట్లాడలేకపోయారు.

''సారీ అత్తయ్యా! పిల్లలిద్దరికీ లీవ్ యివ్వనని వాళ్ళ హెడ్ మిస్ట్రెస్ తెగేసి చెప్పింది. అందుచేత రేపటి హోమ్ వర్కు చేస్తూనే నిద్రపోయారు వెర్రి వెధవలు. అన్నట్టు మీ వృద్ధాశ్రమంలో మీకు హాల్లోనే పడుకోవడం యిష్టమని యిక్కడే పక్క ఏర్పాటు చేశాను. మీకు చూడాలనిపించినంతసేపు టీవీ చూసి పడుకోండి. ఉదయం మాట్లాడుకుందాం'' అనేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసుకుంది రవళి.

అంజనాదేవిగారు భర్తకేసి ''అందుకే నేను రానన్నది'' అన్నట్టుగా చూసి లేచి మనవల బెడ్‌రూమ్‌లోకి వచ్చి వాడిపోయిన కలువల్లా గాఢనిద్రలో ఉన్న మనవల నుదుట ముద్దాడి హాల్లోకి వచ్చారు.

అప్పటికే టీవీ కట్టేసి నిద్రకుపక్రమించిన రమణరావు

## ప్చ్! కత్రినా కైఫ్!!

**మ**నసుకు చెందిన విషయాల్లో చాలా జాగ్రత్తగా వుంటాను అంటుంది కత్రినా కైఫ్. సల్మాన్ ఖాన్‌తో మీ ప్రేమాయణం సంగతేంటీ అంటే- మా గురించి చాలా కాలంగా జనం చాలా రకాలుగా చర్చిస్తున్నారని నాకూ తెలుసు. కానీ ఈ విషయంలో నేనెలాంటి కామెంట్లూ చేయను. అసలు సెలబ్రిటీలకు సంబంధించిన పర్సనల్ మేటర్స్ బహిరంగ పర్చకూడదనేది నా అభిమతం అంటుంది కత్రినా. పెళ్లనేది ఎవరితో ఆ దేవుడు రాసిపెట్టి వుంటే ఆ వ్యక్తితోనే జరుగుతుందని కూడా కత్రినా నమ్ముతుందిట. బానే వుందిగానీ అడిగిన ప్రశ్నలకి తిన్నగా మాత్రం జవాబిచ్చినట్టు లేదు కదా! ప్చ్!



గారి ప్రక్కన నడుం వాల్చారు.

★ ★ ★

ఉదయం లేచి బ్రష్ చేసుకుని వంటగదివైపు వస్తున్న అంజనాదేవి ఆగిపోయారు. ''మా అమ్మ కాఫీ ఎంత బాగా చేస్తుందో తెలుసా! ఆఖరి గుటక వేస్తూనే రెండో కప్పు కాఫీ అడుగుతావు'' అంటున్నాడు మహీధర్.

''నిజమా! అత్తయ్య అంత బాగా పెడతారా ఫిల్టర్ కాఫీ! నాకు తెలీదే! అయినా రోజూ నా చేతి కాఫీ తాగుతూ ఒక్కనాడు ఆ మాట చెప్ప లేదేం?''

''నీ మొహం! నేను చాలాసార్లు అన్నాను. నువ్వు వినిపించుకుని ఉండవు. అలాగే అమ్మ వంట చేసిందంటే యిక ఆ మరునాటి వరకూ భోజనం చేయనవసరం లేదు''

''అయితే ఈ రెండు రోజులు మీ అమ్మగారి చేతే వంట చేయించుకోండి'' బుంగమూతి పెడుతూ అన్న రవళి వంటగదిలోంచి బయటకు రాబోతూ అత్తగార్ని చూస్తూనే అంది- ఫిర్యాదు చేస్తున్నట్టు.

''చూడండత్తయ్యా! మీరు ఎంతో బాగా వంట చేస్తారట. అంటే యింతకాలం నుంచీ నా వంట ఖర్మకాలే తింటురు అనేగా అర్థం!''

''పోనీలేమ్మా! అలా ఎందుకనుకోవాలి? ఈ రెండు రోజులు నువు వంట ముట్టుకుంటే నా మీద ఒట్టే సరేనా!'' అంటూ కాఫీ కలపడం కోసం నడుము బిగించారామె.

భోజనాలు అయిన వెంటనే ఆఫీసు నుంచి అర్జంటు ఫోన్లు రావడంతో విసుక్కుంటూ మహీధర్, కాలనీలో మరో ఆఫీసర్‌గారి భార్య దగ్గర కట్ వర్క్ నేర్చేసుకుని వస్తానని రవళి వెళ్ళిపోయారు.

మళ్ళీ ఎపుడో సాయంత్రం టిఫిన్ వేళకు వచ్చారు.

అప్పటికే రాత్రి వంట కూడా పూర్తి చేశారు అంజనాదేవి.

తను నేర్చుకున్న వర్క్ కొత్తగా నేర్చుకున్న ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన చీరలు అన్నీ చూపుతూ కబుర్లు చెబుతుండగానే పిల్లలు వచ్చారు.

మళ్ళీ గత రాత్రి టైం టేబులే.

యిదే విధంగా శనివారం కూడా గడిచిపోయింది.

''రేపు సెలవే కదా! ఈ వేళయినా పిల్లలతో మేము కాసేపు కబుర్లు చెప్పుకోవచ్చా'' అడిగారు రమణరావుగారు కోడలిని.

''అయ్యో ఎంతమాట! వాళ్ళకి ఖాళీలేక గానీ, లేకపోతే మీకు ఎన్నో కబుర్లు చెప్పేవారు. పిల్లలూ! ఈ వేళంతా మీరు తాతగారితో, నానమ్మతో కబుర్లు చెప్పుకోండి. మీ యిష్టం'' అంటూ పర్మిషనిచ్చింది రవళి.

ఆ కొద్ది సమయానికే బ్రహ్మానందపడిపోయారా దంపతులు.

అందరి భోజనాలు అయ్యాక టీవీ ముందు కూర్చున్నారు.

అది రమణరావు దంపతులు ఉంటున్న వృద్ధాశ్రమంపై రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం. ఆ వృద్ధాశ్రమంలో చేరిన వృద్ధుల మనోగతాలు, వ్యథలు, వెతలు, ఏ పరిస్థితిలో తాము అక్కడ చేరిందీ, నిర్మొహమాటంగా వెల్లడిస్తున్నారు. తమ ప్రస్తుత పరిస్థితి, తమను అక్కడ చేర్పించిన తమ పిల్లలకు రాకుండా చేయాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని, వారెక్కడున్నా క్షేమ, స్థైర్య, విజయ, ధైర్య, ఐశ్వర్య, ఆరోగ్యాలతో సుఖంగా శాంతిగా ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు.

కొందరు వృద్ధులైతే వెక్కి వెక్కి ఏడ్చారు. తమను అక్కడ చేర్చాక కనీసం బ్రతికి ఉన్నారో లేదో చూసే నాథుడులేడని!

పరశురామయ్యగారు, ఆయన భార్య కూడా మాట్లాడారు.

మహీధర్, రవళి ముఖాలు నల్లగా అవడం గమనించారు రమణరావు దంపతులు.

ఆ కార్యక్రమం మీద తీవ్ర నిరసన తెలియజేసింది రవళి.

''వాళ్ళు పిల్లలు ఎటువంటి పరిస్థితుల్లో తమ యిళ్ళలో ఆ తల్లిదండ్రుల్ని ఉంచలేకపోతున్నారో టీవీ వాళ్ళకేం తెలుసు? అయినా ఆ ముసలాళ్ళు కూడా అంత నిర్మొహమాటంగా తమ పిల్లలు ఎంత వెధవలో అలా బహిరంగంగా చెప్పేయాలా ప్రజలందరి ముందూ వెధవల్ని చేయాలని కాకపోతే?'' అంటూ-

''పోనీలేమ్మా! వాళ్ల మనసులో బాధ కొద్దీ అని ఉంటారు. అందరూ మీలా వారానికో, నెలకో ఒకసారైనా వచ్చి కనిపించి వెళ్తే ఆ ముసలి ప్రాణాలు ఎంత సంతోషిస్తాయో! అది వాళ్ళంతట వాళ్ళు తెలుసుకోవాలిగానీ ఎవరేం చెయ్యగలం?'' అన్నారు అంజనాదేవి.

''నాకు తలనొప్పిగా ఉంది! నేను వెళ్ళిపడుకుంటాను నాన్నగారూ!'' అంటూ తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు మహీధర్.

''మీరు ఈ నైట్‌కి తాతగారి దగ్గరే పడుకోండి. ఆయన బుర్ర పాడయిపోయింది. నేనూ వెళ్తానత్తయ్యా!'' అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది రవళి.

నిద్రపోతున్న మనుమలను చూస్తూ ఎవరి జ్ఞాపకాలలో వాళ్ళు ఉండిపోయిన రమణరావు దంపతులకు చాలాసేపటికి గాని నిద్రపట్టలేదు.

★ ★ ★

అర్థరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది అంజనాదేవిగారికి.

మంచి నీళ్ళు తాగుదామని వంటగదివైపు పోబోతున్న ఆమె కొడుకు బెడ్‌రూమ్‌లోంచి వినబడుతున్న మాటలు వింటూ ఆగిపోయింది.

''పెళ్ళాం రెండు రోజులు వంట చేయకుండా మీరు ప్లే చేసిన ట్రిక్కు గ్రాండ్ సక్సెస్.. అందుకు మీకే బహుమతి..'' ఆమె ఏం బహుమతి యివ్వబోయిందోగాని ''మరేంటనుకున్నావ్ అయ్యగారంటే? యింత చిన్న బహుమతా?'' అంటున్నాడు గారంగా మహీధర్.

''లేదు లేదు. మీ ఫ్రెండ్ పవన్ ఆ టీవీనైన్ కార్యక్రమం ఉందని ముందుగా తెలుసుకొని చెప్పబట్టి సరిపోయింది. వెంటనే మీ అమ్మ, నాన్నలను అక్కడ నుంచి తప్పించి తీసుకొచ్చాం. అదే వీళ్ళు అక్కడ ఉండగా ఆ కార్యక్రమం జరిగి ఉంటే మన గురించి ఏం చెప్పేవారో ఏమో! మన పని అయిపోయిందిగా! రేపు తీసుకెళ్ళి అక్కడ వదిలేసి రండి! ఏది ఏమైనా నా మాట మన్నించి నా కోర్కె తీర్చినందుకు మీకు అసలైన బహుమతి నేనే! మీ యిష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు!'' అంది రవళి.

''నీ పంతం నెగ్గించుకునేందుకు- వారం రోజులు పస్తునపెట్టే యిపుడు బహుమతులిస్తావా! అసలు నిన్ను...''

యిక వినలేకపోయారావిడ.

లేక లేక కలిగిన ఒక్కగానొక్క కొడుకుని అల్లారుముద్దుగా పెంచి, ప్రాణప్రదంగా ప్రేమించి, అడిగిందే తడవుగా కాదనకుండా అతి చిన్న కోరిక నుంచి అది పెద్ద కోరిక వరకూ తీర్చి పెద్ద చేసినందుకు యిదా తన కొడుకు తమకు ఇచ్చే ప్రతిఫలం, యిచ్చే విలువ! ఎంత నాటకం ఆడాడు? యిదా వీడి అసలు స్వరూపం? తల్లి దండ్రులందు దయలేని పుత్రుడు.. సుమతీ శతకంలోని పద్యం గుర్తొచ్చింది ఆమెకు. దాసుడైన వాడికి, అదీ భార్యాదాసుడైన వాడికి ఈ వృద్ధాప్యంలో కన్నవారిని సాకే అవసరం, అవకాశం లేదీ రోజుల్లో. వీళ్లకన్నా ఆ ఆశ్రమంలోని వారే తమకు అసలైన ఆత్మబంధువులు. 'తనకు మాలిన ధర్మం పనికిరాదు నాయనా' అని నేర్పినందుకు 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్టు చేశాడు. ఈ శిక్ష అనుభవించాల్సిందే. అవును! ఈ పాపం మాదే! ఉదయాన్నే లేచి ఒక్క క్షణం కూడా యిక్కడ ఉండకూడదు' అని నిర్ణయించుకొని మంచి నీళ్ళు తాగడం మర్చిపోయి వచ్చి గాఢనిద్రలో ఉన్న భర్త పక్కనే పడుకుని బెడ్‌లైట్‌కేసి చూస్తూ ఉండిపోయారామె!

☆